నిట్ విద్యార్థికి 64 లక్షల ప్యాకేజీ

79.7% మంది విద్యార్థులకు ఉద్యోగాలు

హనుమకొండ చౌరస్తా, మే 23 : వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)కి చెందిన ఈసీఈ విద్యార్థి సోమిల్ మల్దానీకి రూ.64.3లక్షల గరిష్ఠ ప్యాకేజీ లభించినట్టు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. 79.7శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 290కి పైగా సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయని, 1,508 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌కు నమోదు చేసుకోగా, 1,201 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. యూజీలో 679 మంది, పీజీలో 522 మంది కాగా, మొత్తం 79.7శాతం ప్లేస్‌మెంట్ రేటుగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులందరికీ సగటు ప్యాకేజీ రూ.14.35లక్షలు ఉండగా, యూజీ విద్యార్థులకు రూ.16 లక్షలు, పీజీ విద్యార్థులకు రూ.12.20 లక్షలుగా ఉందని వెల్లడించారు. తొలిసారి పీహెచ్‌డీ విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక ప్రయత్నాలు చేయగా, ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్టు, వీరి సగటు ప్యాకేజీ రూ.9 లక్షలుగా ఉందని తెలిపారు.

యూపీఎస్సీ ఫలితాల్లో 25వ ర్యాంకు

జడ్చర్లటౌన్, మే 23 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణానికి చెందిన యువకుడు ప్రశాంత్ ఇటీవల విడుదలైన యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 25వ ర్యాంకు సాధించాడు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్(ఐఎఫ్ఎస్)లో 25వ ర్యాంకు సాధించటం పట్ల జడ్చర్ల మాదిగ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా 143 మంది ఎంపికవగా తెలుగు రాష్ట్రాలకు చెందిన 15 మందిలో జడ్చర్లకు చెందిన యువకుడు ప్రశాంత్ ఎంపికైనట్టు మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కావలి కృష్ణ తెలిపారు.

కల్లు కాంపౌండ్‌గా నీరాకేఫ్!

- నీరాకేఫ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు
- నిర్వహణ రేట్లు పెంచిన కల్లుగీత కార్పొరేషన్
- ఆ రేట్లకు నీరా నాణ్యత లోపిస్తుందని గౌడన్నల ఆవేదన
- కల్లు గీత కార్పొరేషనే నీరాకేఫ్‌ను నిర్వహించాలని డిమాండ్
- లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని గౌడ సంఘాల హెచ్చరిక

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గౌడన్నల ఆత్మగౌరవ పతాక నీరా కేఫ్ కల్లు కాంపౌండ్‌గా మారనుందా? అంటే అవుననే అంటున్నారు కల్లుగీత కార్మికులు, గౌడ సంఘాల నాయకులు. టూరిజం కార్పొరేషన్ నుంచి కల్లుగీత కార్పొరేషన్‌లోకి విలీనం చేసుకున్న నీరాకేఫ్‌ను కల్లుగీత కార్పొరేషన్ పూర్తిస్థాయిలో నిర్వహించకుండానే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేసింది. దాని నిర్వహణకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి టెండర్లు ఆహ్వానించింది. నెక్లెస్ రోడ్‌లోని నీరాకేఫ్, ఆ భవనంలోని మెషినరీతో పాటు నీరా ప్రాసెసింగ్ యూనిట్, పైన లేక్ వ్యూ బాంక్వెట్ హాల్ (ఒకటో అంతస్తు), ఆరు కమర్షియల్ షాపుల లీజు కోసం కల్లుగీత కార్పొరేషన్ టెండర్లు కోరింది. వాటిల్లో బాంక్వెట్ హాల్‌కు నెలకు రూ. 2 లక్షలు, నీరా ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.75 వేలు, ఆరు కమర్షియల్ షాపుల్లో ఒక్కో షాపునకు రూ. 25 వేలు ప్రతినెలా అద్దె వచ్చేలా నిబంధనలు రూపొందించింది. మొత్తంగా నెలకు కనీసం రూ.4.25,000 ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రచించింది. ప్రతి నెలా 5వ తేదీన వాటికి చెల్లించాల్సిన మంత్లీ లీజ్ తప్పకుండా చెల్లించాలని నిబంధనల్లో పేర్కొన్నది. కానీ, నీరాను సరఫరా చేసే వ్యవస్థను మాత్రం వదిలివేసింది.

కల్లుగీత కార్పొరేషన్ నిర్వహించలేదా?

రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులు సుమారు 3 లక్షల మంది వరకు ఉన్నారు. నీరాకేఫ్‌ను ప్రైవేటుకు అప్పగిస్తే వారు విధించే రేట్లకు కేఫ్ కాస్తా కల్లు దుకాణంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిని ప్రభుత్వమే నిర్వహిస్తే రూ. 30 కోట్లు వస్తాయని, ఆ సొమ్మును గౌడన్నల సంక్షేమానికి ఖర్చు చేయవచ్చని చెప్పున్నారు. నగరంలోని కల్లు కాంపౌండ్లు ఇప్పటికే గుత్తేదారుల చేతిలో నలుగుతున్నాయని, కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని పలు సంఘాలు కోరుతున్నాయి. లేదంటే అసెంబ్లీ ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

నీరా కేఫ్ టెండర్లు ఆపండి: అంబాల

కల్లుగీత కార్పొరేషన్ ద్వారానే నీరాకేఫ్ నిర్వహించాలని నిరుపేద గీత వృత్తిదారులకు ఉపాధి కల్పించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ కోరారు. గీత కార్పొరేషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో గీతన్నల సంక్షేమం కోసం కృషిచేయాలన్నారు. పాడి పరిశ్రమలా నీరా పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమగ్ర విధానం రూపొందించాలని కోరారు. హైదరాబాద్‌లో కల్లుగీత సంఘాలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరాకేఫ్ నిర్వహణకు పిలిచిన టెండర్లను నిలిపివేయాలని కోరారు. టెండర్లు పిలిచే ముందు గౌడ, కల్లుగీత సంఘాలను ప్రభుత్వం సంప్రదించకపోవడం బాధాకరమన్నారు. నిజమైన వృత్తిదారులకు న్యాయం జరగాలంటే గీత కార్పొరేషన్ ద్వారానే నీరాకేఫ్‌ను నిర్వహించాలన్నారు. కేరళ రాష్ట్రం మాదిరిగా తెలంగాణలోనూ నీరా బోర్డులు ఏర్పాటు చేసి గీత కార్పొరేషన్ ద్వారా వాటిని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కేసీఆరే మా నాయకుడు

మొదటిపేజీ తరువాయి...

గ్రాడ్యుయేషన్ సెర్మనీ పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపలే నేను రాసిన లేఖ ఏదో లీకైందని చెప్పి రెండు, మూడు రోజులుగా ఇక్కడ చాలా హంగామా నడుస్తున్నది. ఈ సందర్భంగా నేను చెప్పదలుచున్నది ఒకటే. రెండు వారాల క్రితం కేసీఆర్‌కు లేఖ రాసిన. గతంలోనూ పలుమార్లు నా అభిప్రాయాలను లేఖ ద్వారా చెప్పిన. అయితే కేసీఆర్‌కు అంతర్గతంగా రాసిన ఉత్తరం బహిర్గతమైంది. దీనిని బట్టి ఏం జరుగుతున్నదో మనందరం, తెలంగాణలోని అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. నేను కేసీఆర్‌గారి కూతురిని, అంతరంగికంగా నేను రాసిన లేఖను బయటకు తీశారంటే ఇతరుల పరిస్థితి ఏమిటన్నది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నది. నేను వేరే ఏ విషయాలూ చెప్పలేదు. పార్టీలోని అన్ని స్థాయుల్లో అనుకుంటున్న విషయాలనే ప్రస్తావించిన' అని కవిత వివరించారు. ఇటీవలి కాలంలో తెలంగాణలోని సగం ప్రాంతాన్ని చుట్టివచ్చానని, గ్రౌండ్‌లెవల్‌లో అనుకుంటున్న విషయాలనే చెప్పానని, ఇందులో తన వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదని స్పష్టంచేశారు. 'నాకు ఎవరిపైనా ప్రేమా లేదు, ద్వేషమూ లేదు. పార్టీలోని లోపాలను చర్చించుకొని, సవరించుకుంటూపోతే పార్టీ పదికాలాలపాటు చల్లగా ఉంటుందనేది నా భావన. నేను రాసిన లేఖ బయటకు రావడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కోతికి కొబ్బరిచిప్ప దొరికిన చందంగా సంబురపడుతున్నాయి. ఆ పార్టీలకు అంత సీన్ లేదు. మా నాయకుడు కేసీఆరే. ఆయన నాయకత్వంలోనే తెలంగాణకు మేలు జరుగుతుంది. పార్టీలో ఉన్నటువంటి చిన్నచిన్న లోపాలను చర్చించుకొని, సవరించుకుంటే పార్టీ మరింత పటిష్టమవుతుంది. తెలంగాణను ఫెయిల్ చేసిన కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం కేసీఆర్ నాయకత్వమే. ఆయన నేతృత్వంలోనే తెలంగాణ ముందుకు పోతదని బలంగా నమ్ముతున్న' అని కవిత పేర్కొన్నారు.

ఖర్చు ఆదా కోసం 'స్పెండ్ స్మార్ట్' యాప్!

- ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించిన భారత సంతతి బాలుడు శౌర్య గుప్తా
- సులువుగా, ఫ్రీగా వాడుకొనే సౌకర్యం

న్యూఢిల్లీ: మీరు ప్రతి నెలా ఎంత ఖర్చు పెడుతున్నారో లెక్కలేసుకోవడం లేదా లేక మీరు మీ ఖర్చులన్నీ సరి చూసే యాప్ కావాలనుకుంటున్నారా? అయితే భారత సంతతి కెనడా బాలుడు శౌర్య గుప్తా రూపొందించిన ఏఐ ఆధారిత స్పెండ్‌స్మార్ట్ యాప్ వాడండి. ఈ యాప్ ప్రస్తుతానికి ఐఓఎస్‌లో ఉచితంగా లభిస్తున్నది. కేవలం మీరు మీ రశీదులు, బిల్లులు, ఖర్చుల డాక్యుమెంట్లు స్కాన్ లేదా అప్‌లోడ్ చేస్తే చాలు. ఈ యాప్ వాటన్నింటినీ క్రోడీకరించి మీ ఖర్చుల వివరాలను వెల్లడిస్తుంది. యాప్‌లోకి లాగిన్ అయ్యాక న్యూ ఎక్స్‌పెన్స్ మీద క్లిక్ చేసి ఖర్చుల బిల్ లేదా రశీదు ఫొటోను స్కాన్ లేదా అప్‌లోడ్ చేయాలి. బిల్ లేదా రశీదు పెద్దగా ఉంటే దాన్ని నాలుగైదు ఫొటోలుగా తీసి అప్‌లోడ్ చేసినా.. ఈ యాప్ అన్నింటిని కలిపి ఒక్కటిగా లెక్కేసుకొని చక్కగా ఖర్చు లెక్కలేస్తుంది. అలా ఒక్కొక్క బిల్ లేదా రశీదు జత చేస్తూ పోతే మనం ఎంత మొత్తం ఖర్చు పెడుతున్నామో ఆటోమేటిగ్గా చూపించి, మనం ఎంత ఆదా చేశామో.. మన నెలవారీ ఖర్చు ఎంతో చూపిస్తుంది. హిస్టరీ సెక్షన్‌లో పాత బిల్లు కావాల్సి వస్తే ఆ బిల్లు లోగో మీద క్లిక్ చేస్తే వెంటనే దాన్ని ట్రాక్ చేస్తుంది. ఈ యాప్ చెల్లింపు విధానం, కరెన్సీ, బిల్లు ఇచ్చిన ప్రాంతం, విభాగం, బిల్లులోని ఒక్కో వస్తువు వివరాలు, వాటి ధరలు, రాయితీలను నమోదు చేస్తుంది.

డిష్‌లతో పాటు గ్రేవీ తప్పనిసరిగా ఇవ్వక్కర్లేదు

తిరువనంతపురం, మే 23: హోటళ్లలో వడ్డించే డిష్‌లతో పాటు గ్రేవీని తప్పనిసరిగా ఇవ్వాల్సిన అవసరం లేదని కేరళలోని ఒక వినియోగదారుల న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒక వేళ ఖాతాదారుడు తప్పనిసరిగా గ్రేవీ కావాలనుకుంటే దానికి అదనపు చార్జీ చెల్లించాలని తీర్పు చెప్పింది. ఓ హోటల్‌పై వినియోగదారుడు ఫిర్యాదు చేయగా ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలో ఏసీబీ తనిఖీలు

- భవన నిర్మాణ అనుమతులకు రూ. 8 లక్షలు డిమాండ్
- టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ విఠల్‌రావును విచారిస్తున్న ఏసీబీ

విఠల్ రావు

సికింద్రాబాద్, మే 23: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న విఠల్‌రావు కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్‌కు చెందిన వెంకట్‌రావు రెండు భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సి సర్టిఫికెట్ నిమిత్తం జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆశ్రయించగా రూ. 8 లక్షలు లంచం డిమాండ్ చేశారు. విఠల్‌రావు రూ. 4 లక్షలను సఫిల్‌గూడ వద్ద తీసుకున్నట్టు నిర్ధారణ అయ్యిందని ఏసీబీ అధికారి శ్రీధర్ తెలిపారు. మరో రూ. 4 లక్షల కోసం వెంకట్‌రావుపై ఏసీపీ విఠల్ రావు ఒత్తిడి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. రూ. 4 లక్షలు ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ అనుమతుల ఫైళ్లను తిరస్కరించినట్టు తెలిపారు. దీంతో బాధితుడు వెంకట్‌రావు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో విఠల్‌రావును ప్రశ్నించారు. మేడిపల్లిలోని ఆయన నివాసంతోపాటు నాచారంలోని ప్రైవేట్ కార్యాలయంలో నగదు కోసం సోదాలు నిర్వహిస్తున్నట్టు ఏసీబీ అధికారి శ్రీధర్ వెల్లడించారు.

ఏసీబీ వలలో ఏపీపీ, కానిస్టేబుల్

రూ. 10వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుగులోత్ అశోక్ శివరాం నాయక్, కానిస్టేబుల్ నిమ్మ సంజయ్

కామారెడ్డి, మే 23 : కామారెడ్డి కోర్టులో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కానిస్టేబుల్ ఓ కేసు విషయమై బాధితుడి నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో నమోదైన ఓ చీటింగ్ కేసుపై కోర్టులో విచారణ జరుగుతున్నది. ఈ కేసును త్వరగా పూర్తి చేయాలంటే కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న గుగులోత్ అశోక్ శివరాంనాయక్, కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నిమ్మ సంజయ్ రూ.15వేలు లంచం ఇవ్వాలని బాధితుడిని డిమాండ్ చేశారు. చివరికి వారు రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం కోర్టు ఆవరణలో అశోక్ రూ.10వేలు లంచం ఇస్తుండగా శివరాం నాయక్, సంజయ్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇంట్లో సోదాలు చేపట్టినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏపీపీ, కానిస్టేబుల్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో శనివారం హాజరుపరుస్తామని చెప్పారు.

ఎస్సారెస్పీలోకి 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, మే 23 : ఎగువ ప్రాంతం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద ప్రారంభమైంది. మూడురోజులుగా 2,500 క్యూసెక్కులకుపైగా వరద వస్తున్నది. ఎండాకాలంలో ప్రాజెక్ట్‌లో నీరు డెడ్‌స్టోరేజీకి చేరుకుంటుందనుకునే తరుణంలో అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో వస్తున్నది. నెలరోజులుగా ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి నిల్వలు తాగునీటి అవసరాల కోసం అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెప్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ తాగునీటికోసం నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 231 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు.

ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటిమట్టం 11.781 టీఎంసీలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1061.30అడుగుల (11.781టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 321 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

నర్సింగ్ సర్టిఫికెట్ల 'రెన్యువల్'పై గందరగోళం

- రాష్ట్ర విభజనకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి వివరాలు ఏపీ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదు
- తెలంగాణకు మారాలంటే 3 నెలలు ఆగాల్సిందే
- గ్రేస్ పిరియడ్ దాటితే రూ.7 వేల జరిమానా
- రెన్యువల్ త్వరగా చేయాలని నర్సుల డిమాండ్

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజనకు ముందు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ)లో నర్సులుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి తాజా రెన్యువల్ ప్రక్రియ గందరగోళంగా మారింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రెన్యువల్ చేసుకున్నవారి వివరాలు ఇక్కడి నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదు కాగా.. తెలంగాణ ఏర్పాటుకు ముందు రెన్యువల్ చేసుకున్నవారి వివరాలు ఏపీ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదయ్యాయి. దీంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు వెంటనే తమ సర్టిఫికెట్లను నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగం పొందిన తర్వాత వారు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో ఆ సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. వాటిని నర్సింగ్ కౌన్సిల్ పరిశీలించి ఆ అభ్యర్థులకు రిజిస్టర్డ్ నర్సులు, మిడ్-వైఫరీలుగా రిజిస్ట్రేషన్ నంబర్లు జారీ చేస్తుంది. ఆ నర్సులంతా తమ నర్సింగ్ సర్టిఫికెట్లను ప్రతి ఐదేండ్లకోసారి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ)లో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా రెన్యువల్ చేసుకున్న నర్సులకు ఐఎన్‌సీ నేషనల్ యూనిక్ ఐడెంటిటీ నంబర్ (ఎన్‌యూఐడీ)ని జారీచేస్తుంది. ఈ రెన్యువల్ ప్రక్రియ జరిగితేనే వారు చట్టబద్ధంగా నర్సు ఉద్యోగంలో కొనసాగేందుకు వీలవుతుంది. కానీ, ఐఎన్‌సీ 2017లో ఎన్‌యూఐడీ కార్డులను ప్రవేశపెట్టడంతో 2014కు ముందు రెన్యువల్ చేసుకున్నవారి వివరాలు ఏపీ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదయ్యాయి. ఇదే ఇప్పుడు వారికి ఇబ్బందికరంగా మారింది. రెన్యువల్ సమయంలో తెలంగాణ అని ఆప్షన్ ఇచ్చుకున్నవారు ఏపీ నుంచి తెలంగాణకు మారడానికి 3 నెలల సమయం పడుతున్నదని ఆ నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సులకు భారంగా జరిమానా

నర్సింగ్ సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేసుకునేందుకు ఎన్‌యూఐడీ కార్డు తప్పనిసరని నర్సింగ్ కౌన్సిల్‌లో నిబంధన పెట్టారని నర్సులు తెలిపారు. రెన్యువల్ ప్రక్రియకు 6 నెలల గ్రేస్ పిరియడ్ పెట్టారని, ఆ గడువు దాటితే రూ.5 వేలు, రెన్యువల్‌కు మరో రూ.2 వేలు జరిమానా విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెన్యువల్ కోసం ప్రతి రోజూ కోఠిలోని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌కు 500 నుంచి 1000 మంది వస్తున్నారు. ఫోన్ ద్వారా ఈ ప్రక్రియ చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నప్పటికీ రెన్యువల్ కావడం లేదని నర్సులు వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 81,173 మంది నర్సుల్లో ఇప్పటివరకు ఎన్‌యూఐడీ కోసం 51,285 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 27,467 మందికి ఎన్‌యూఐడీ జారీ అయినట్టు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్ స్పష్టం చేస్తున్నది. కాగా, ఇటీవల 2,300 నర్సింగ్ పోస్టులకు దాదాపు 40 వేల మంది పరీక్షలు రాశారు. వాటి ఫలితాలు గత వారమే విడుదల కావడంతో ప్రొవిజన్ లిస్టు కోసం అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. వీరంతా ప్రస్తుతం ఎన్‌యూఐడీ కార్డు కోసం దరఖాస్తు చేశారు. వారికి ఆ కార్డు రావడానికి 3 నెలల సమయం పడుతుందని కౌన్సిల్ అధికారులు చెప్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ ఆలస్యమైతే వారంతా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉన్నది. ఆఫీసులో కేవలం రెండు కంప్యూటర్లతోనే రెన్యువల్ ప్రక్రియ చేస్తున్నారని, దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే నర్సులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని నర్సులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తోపాటు వైద్యశాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి రెన్యువల్ ప్రక్రియ వేగవంతమయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని నర్సింగ్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎన్ఆర్టీఎస్ మార్గదర్శకాలు ఇలా..

నర్సుల రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎన్ఆర్టీఎస్)లో నమోదైనవారికి ఆధార్ బేస్డ్ బయోమెట్రిక్ అథెంటికేషన్ వర్తిస్తుంది. నర్సులకు నేషనల్ యూనిక్ ఐడెంటిటీ నంబర్(ఎన్‌యూఐడీ)ని కేటాయిస్తారు. వారు తమ లైసెన్స్‌ను ప్రతి ఐదేండ్లకోసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొత్తం ఎంత మంది నర్సులు ఉన్నారనే గణాంకాలు కేంద్రం వద్ద ఉంటాయి. ఎన్ఆర్టీఎస్‌లో పేరును నమోదు చేసుకున్న నర్సులకు వారి ఉద్యోగానికి సంబంధించిన పూర్తి వివరాలతో ఏకరూప పాస్‌బుక్‌లను జారీ చేస్తారు.

నల్లమలలో అడవిదున్న

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీప్రాంతం అప్పాపూర్-ఫరహాబాద్ వ్యూపాయింట్ దారిలో అడవిదున్న ప్రత్యక్షమైంది. మన్ననూర్ ఐటీడీఏలో ఏతగా పనిచేస్తున్న రఘు అప్పాపూర్‌లో గవర్నర్ నిధుల ద్వారా జరుగుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులు, గిరిజన ఆశ్రమపాఠశాలలో బాత్‌రూం మరమ్మతులు పరిశీలించేందుకు శుక్రవారం వెళ్లారు. తిరిగి వస్తుండగా ఫరహాబాద్ చెక్‌పోస్ట్‌కు (పులిబొమ్మ) కిలోమీటర్ దూరంలో గడ్డి మేస్తూ అడవిదున్న కనిపించింది. ఆ దృశ్యాన్ని ఫోన్‌లో బంధించి అటవీ సిబ్బందికి తెలపగా వారు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. -అచ్చంపేట

వరంగల్ జిల్లా ఉర్సుగుట్ట వద్ద యాంటీ నార్కోటిక్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, నిందితులను చూపుతున్న పోలీసులు

కోటి విలువైన గంజాయి పట్టివేత

నలుగురు అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు

కరీమాబాద్, మే 23: వరంగల్ జిల్లా ఉర్సుగుట్ట వద్ద రూ. 1,05,38,000 విలువైన 210 కిలోల 750 గ్రాముల ఎండు గంజాయిని శుక్రవారం యాంటీ నార్కోటిక్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని అడవి అన్నవరం నుంచి శ్రీను, భాస్కర్, రాము, వినోద్ కలిసి మహబూబాబాద్ జిల్లా మరిపెడ-తొర్రూరు నుంచి వరంగల్ మీదుగా హైదరాబాద్‌లో గంజాయి విక్రయించేందుకు వాహనంలో బయల్దేరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉర్సుగుట్ట వద్ద తనిఖీలు చేపట్టారు. షిఫ్ట్ కారు ఎస్కార్ట్‌గా ముందు వెళ్లగా ట్రాక్టర్‌లో 210.750 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారు. పోలీసులు తనిఖీలు చేసి గంజాయి రవాణా చేస్తున్న గుగులోత్ భాస్కర్, కేతావత్ రాము, కొర్ర వినోద్, విరోదుల శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. తల్లిబాబు, గోవిందమ్మ, శ్రీకాంత్ పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. వారి నుంచి ట్రాక్టర్, స్విఫ్ట్ కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు యాంటీ నార్కోటిక్స్ పోలీసులు తెలిపారు.

సీపీ ఆనంద్‌కు ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

సంధ్యాథియేటర్ ఘటనలో పోలీసుల నివేదికపై అసంతృప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్యా థియేటర్ కేసులో నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ మరోసారి పోలీసులపై సీరియస్ అయ్యింది. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు నోటీసులు జారీ చేసింది. సంధ్యాథియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్‌షో సందర్భంగా గత సంవత్సరం డిసెంబర్ 4న తొక్కిసలాట జరిగి దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి చనిపోగా ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. జనవరిలో ఇమ్మనేని రామారావు ఈ ఘటనపై ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. అప్పుడే పూర్తి నివేదిక ఇవ్వాలంటూ చిక్కడపల్లి ఏసీపీ, జోన్ డీసీపీ తదితరులకు కమిషన్ నోటీసులు ఇచ్చింది. పోలీసులు ఇచ్చిన నివేదికలో సరైన వివరాలు లేవంటూ కమిషన్ సీరియస్ అయింది. అల్లు అర్జున్ వచ్చేందుకు అనుమతి ఇవ్వలేదని పోలీసులు ఎన్‌హెచ్ఆర్సీకి చెప్పగా.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న థియేటర్ దగ్గర డీజేలు పెట్టి హంగామా చేస్తుంటే ఎందుకు పట్టించుకోలేదంటూ పోలీసులను ప్రశ్నించింది. పోలీసుల లాఠీచార్జి వల్ల తొక్కిసలాట జరగలేదంటూ, అల్లు అర్జున్ రావడం వల్లే జరిగిందని పోలీసులు రిపోర్టులో పేర్కొనగా.. అనుమతి నిరాకరించినప్పుడు షో టైంలో అల్లు అర్జున్ ఎలా వచ్చాడని, అంతమంది గుమిగూడినప్పుడు పోలీసులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించింది. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని, తమకు ఇచ్చిన రిపోర్టులో కూడా సరైన వివరాలు లేవంటూ కమిషన్ సీరియస్ అయింది. కమిషనర్ సీవీ ఆనంద్‌కు నోటీసులు ఇచ్చి ఆర